ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

సోమవారం 30 జూన్ 2025



పనులు వేగవంతం

- బారా షహీద్ దర్గాకు విద్యుత్ దీపాలంకరణలు
- ప్రాంగణంలో చలువ పందిళ్లు
- భారీ యంత్రాలతో గుర్రపుడెక్క తొలగింపు
- నీటి శుద్ధికి చెరువులో బ్లీచింగ్ చల్లకం
- కొత్త పైపులైన్ల ఏర్పాటు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో జూలై 6 నుంచి జరగనున్న రొట్టెల పండుగకు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. బారాషహీద్ దర్గాను, పరిసరప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దర్గా ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. స్వర్ణాల ఘాట్‌ను శుభ్రం చేయిస్తున్నారు. దర్గాను సందర్శించేందుకు ఇప్పటి నుంచి పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఈసారి రొట్టెల పండుగకు గతంలో కంటే పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పండుగకు ముందు గానే ఏర్పాట్లు పూర్తిచేయాలని మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో నగర పాలక సంస్థ అధికారులు పనులు ముమ్మరం చేశారు. స్వర్ణాల చెరువులో ఘాట్, బోట్‌క్లబ్‌ల వద్ద ఉన్న గుర్రపుడెక్క తొలగించేందుకు ఆదివారం భారీ యంత్రాలను రంగంలోకి దించారు. స్వర్ణాల చెరువులో దీర్ఘకాలంగా చెత్తాచెదారం నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తున్నది. భక్తుల, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువు నీటిశుద్ధికి అధికారులు ఆలం, బ్లీచింగ్‌ను బస్తాలలో నింపి పడవల సాయంతో చెరువులో వదులుతున్నారు. భక్తులకు నీటివసతి కల్పించేందుకు పైపులైన్ల పనులను చేపట్టారు. జూలై 2 నాటికి మౌలిక వసతులను పూర్తి చేయాలని అధికారులు, సిబ్బంది విరామం లేకుండా పనులు చేస్తున్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న జనసేన నాయకులు



విద్యుత్ దీపాలంకరణలో బారా షహీద్ దర్గా



దర్గాలో ప్రాంగణంలో వేసిన పందిళ్లు



పడవపై తిరుగుతూ నీటిశుద్ధికి బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

● పవన్‌కు ఆహ్వానం

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్‌ను రొట్టెల పండుగకు రావాలని ఆహ్వానించామని, ఆయన వచ్చే అవకాశాలు ఉన్నాయని జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు తెలిపారు. బారా షాహీద్ దర్గా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చప్పిడి శ్రీనివాసులురెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ కోలా విజయలక్ష్మి, నాగరత్నం, తదితరులు పాల్గొన్నారు.





స్వర్ణాల చెరువులో గుర్రపుడెక్క తొలగిస్తున్న యంత్రం, పైపులైన్లు నిర్మాణ పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు



ఆలయం ఎదుట సుడిమానును ప్రతిష్ఠిస్తున్న భక్తులు

కలిగిరమ్మ తిరుణాళ్ల ప్రారంభం

కలిగిరి, జూన్29 (ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు జిర్రావారిపాలెం, పాపనముసిలిపాలెం గ్రామాల గ్రామదేవత అయిన కలిగిరమ్మ తిరుణాళ్ల ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఆలయం ఎదుట సుడిమాను ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ఈ తిరుణాళ్ల జరగనున్నాయి.

భూసేకరణపై నిరసన గళం

- ఇండోసోల్ కంపెనీ వ్యవహారంపై హైవే దిగ్బంధం ● వేలాదిమంది రైతుల ఆందోళన
- ముందుండి నడిపిన మహిళలు ● నిలువరించలేక పోయిన పోలీసులు
- ఉన్నతాధికారులతో మాట్లాడి, భూసేకరణ నిలిపేయిస్తా.. ● సబ్ కలెక్టర్ హామీతో శాంతించిన అన్నదాతలు

ఉలవపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీ నిర్మాణం కోసం తలపెట్టిన భూసేకరణ నిలిపివేయాలని కరేడు గ్రామస్థులు, పార్టీలకు అతీతంగా ఆదివారం జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. పోలీసులకు గ్రామస్థులకు వాగ్వాదం జరిగి ఉద్రిక్తత నెలకొన్నా, అనుకున్న ప్రకారం కరేడు ర్యాంపు వద్ద హైవేపై అరగంటపాటు వారు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు, రైతులు సుమారు నాలుగువేలమంది ఒక్కసారిగా రోడ్డెక్కారు. 300 మంది పోలీసులు ఆదివారం తెల్లవారుజాము నుంచి కరేడు నుంచి వచ్చే దారులన్నింటిని దిగ్బంధం చేసినా ఆందోళనకారులను అడ్డుకోలేకపోయారు.

● మహిళల నాయకత్వం

కరేడు పంచాయతీ పరిధిలోని 16 గ్రామాల్లోని మహిళలు పెద్దఎత్తున పాల్గొని, ఆందోళనను ముందుండి నడిపించారు. రామకృష్ణాపురం చిల్లకాలువ బ్రిడ్జిపై బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయినా వారిని నిలువరించలేక పోయారు.

● రైతులకు మద్దతుగా రామచంద్రయాదవ్

భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కరేడు రైతులకు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. కాగా కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, రామచంద్రయాదవ్‌తో సంప్రదింపులు జరిపారు. ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని, హైవేపై నిరసన విరమించుకోవాలని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా నిరసన కారులు పోలీసు బలగాలను తోసుకుంటూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం జరిగి, ఉద్రిక్తత నెలకొంది.

● భూసేకరణ నిలిపివేయిస్తా...

హైవే దిగ్బంధంలో రెండు వైపులా కిలో మీటరుకుపైగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ శ్రీపూజ ఆందోళన కారులతో మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి తాత్కాలికంగా భూసేకరణ జరగ కుండా చూసే బాధ్యతను తాను తీసుకుంటా నని, హామీ ఇవ్వడంతో రైతులు, గ్రామస్థులు ఆందోళన విరమించారు.

● పోలీసుల సంయమనం

కాగా శనివారం సాయంత్రం కరేడు గ్రామానికి డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సిబ్బందితో వెళ్లి హైవేపై నిరసన చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినా, ఆదివారం నిరసన కారులు తరలివచ్చారు. ఆందోళనకారులు కవ్వింపు చర్యలకు పాల్పడినా పోలీసులు సంయమనం పాటించారు. దీంతో పరిస్థితి చేయి దాటిపోలేదు.

● పలువురు నేతల అరెస్టు

కందుకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హైవే నిర్బంధంలో పాల్గొన్న పలు రాజకీయ పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వర రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సుంకర పద్మశ్రీ, మాజీ ప్రొఫెసర్ వసుంధర, సీపీఎం నాయకులు జీ వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, కుమార్ తదితరులు ఉన్నారు.

● ఎమ్మెల్యే బెదిరించారు : మహేశ్వరరావు

రైతుల ఆందోళనకు మద్దతుగా ఆమ్ ఆద్మీ పార్టీ నిలుస్తుందనే ఆక్రోశంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం రాత్రి ఫోన్ చేసి భయ పెట్టారని ఆ పార్టీ నియోజక వర్గ కన్వీనర్ నేతి మహేశ్వ రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదన్నారు.



వివిధ గ్రామాల నుంచి ఆందోళనకు భారీగా తరలివస్తున్న రైతులు



ఉలవపాడు జాతీయ రహదారి కరేడు ర్యాంపు వద్ద హైవేను దిగ్బంధం చేసిన రైతులు, కరేడు గ్రామస్థులు



రామచంద్రయాదవ్, గ్రామస్థులతో మాటాడుతున్న కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ

పచ్చని పొలాల్లో 'ఇండోసోల్' మంటలు

- సోలార్ ప్రాజెక్టు కోసం మా బతుకులు బజారు కీడుస్తారా ?
- మండిపడుతున్న కరేడు రైతులు

కందుకూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం పచ్చని పంట పొలాల్లో మంట పెడతారా ? అని కరేడు గ్రామ రైతులు ఆగ్రహిస్తున్నారు. మాబతుకులను బజారుకు ఈడ్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే, మా ప్రాణాలైన ఇస్తాంకానీ, భూములు ఇచ్చే ప్రసక్తేలేదని వారు స్పష్టం చేస్తున్నారు. కరేడు గ్రామ పరిధిలో ఇండోసోల్ కంపెనీ కోసం 4,855 ఎకరాల భూసేకరణకు ఈనెల 22న కలెక్టర్ ఏకపక్షంగా నోటిఫికేషన్ జారీ చేశారు. దీన్ని నిరసిస్తూ రైతులు ఆదివారం రోడ్డెక్కారు. 17,000లకుపైగా జనాభా కలిగి 16 శివారు గ్రామాలతో కందుకూరు నియోజకవర్గంలోనే అతి పెద్ద గ్రామ పంచాయతీ కరేడు. గ్రామంలో 12,632 ఎకరాల భూములు ఉండగా, అందులో 2,600 ప్రభుత్వ భూమి. 1200 ఎకరాలు అటవీశాఖది. మిగిలిందంతా పట్టా భూమి. కాగా 3,000 ఎకరాలకుపై ఏటా రెండు పంటలు పండే మాగాణి భూమి.400 ఎకరాల్లో మామిడి, సపోట తోటలు ఉండగా 100 ఎకరాలకు పైగా విస్తీరణంలో అరటి తోటలు, టెంకాయ చెట్లు ఉన్నాయి. గ్రామంలో ఎలాంటి ప్రజాభిప్రాయం సేకరణ జరపకుండా కలెక్టర్ భూసేకనణ నోటిఫికేషన్ జారీ చేయడంపై గ్రామప్రజలంతా ఉడికిపోతున్నారు.



కరేడులో సాగులో ఉన్న మామిడి తోటలు



మేమెలా బతకాలి...?

గ్రామంలో ఏళ్ల తరబడి వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నాం. ఏటా మూడు పంటలు పండే మా భూములను సోలార్ పరిశ్రమకోసం తీసుకుంటే మేమేలా బతకాలి. సారవంతమైన భూముల్లో పరిశ్రమ పెట్టాలనుకోవడంలో మర్మమేమిటో తెలపాలి.

- బత్తుల వెంకట రమణారెడ్డి, కరేడు గ్రామ రైతు

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే..

గ్రామంలో ఎలాంటి సమావేశం పెట్టకుండా, మా బతుకుదెరువుకు ఏమి ప్రత్యామ్నాయం చూపిస్తారో చెప్పకుండా, భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చారు. భూములకు ఎంత పరిహారం ఇస్తారో కూడా మాకు తెలియదు. రూ. లక్షల విలువ చేసే మా భూములను లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారు.

- కే రామసుబ్బారెడ్డి, కరేడు గ్రామ రైతు



మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీలు

● నేడు పోలీసు కార్యాలయంలో ప్రక్రియ

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీల ప్రక్రియ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరగనున్నది. జిల్లా వ్యాప్తంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు 700 మంది వరకు ఉన్నారు. వారిలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసినవారు, ప్రత్యేక కేటగిరి, రిక్వెస్టు బదిలీలు కోరుకునేవారు మొత్తం కలిపి సుమారు 500 మందికి స్థానచలనం కలగనున్నది. పోలీసు కార్యాల యంలో ఉదయం 8 నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మహిళా సంరక్షణ కార్యదర్శులుగా పనిచేస్తూ బదిలీలకు అర్హత కలిగిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు పీహెచ్ సర్టిఫికెట్, వీహెచ్ సర్టిఫికెట్, స్పౌజ్, నో డ్యూస్, మెడికల్ సర్టిఫికెట్లను ఒక సెట్ జెరాక్స్‌తోపాటు ఒరిజనల్స్‌ను తీసుకురావాలని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు

కందుకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డులో గల ప్రశాంతి కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు బోర్డు పెట్టారు. సర్వే నెంబరు 122 బై 1లో రూ. కోట్ల విలువ చేసే 1.75 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు కొందరు చదును చేశారు. ఈ విషయమై 'ఖాళీ జాగా.. వేస్తాం పాగా' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ లావణ్య ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమిని లేఅవుట్‌గా మార్చి పేదలకు పట్టాలు ఇచ్చేందుకు మున్సిపల్ నిధులతో మూడేళ్ల క్రితం లెవలింగ్ చేశారు. అయితే కొందరు నకిలీ పట్టాలతో కబ్జా చేసేందుకు యత్నించారు. ఐదుగురు వ్యక్తులు ఒక్కొక్కరు పేరుతో 35 సెంట్ల చొప్పున పట్టాలు సృష్టించుకున్నారని, గుర్తించిన రెవెన్యూ అధికారులు అవి చెల్లుబాటు కావని నిర్ధారణకు వచ్చారు. దీంతో అది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేశారు.



ఆక్రమణకు యత్నించిన భూమిలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	228

కోడిగుడ్ల ధర (100): 575

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9200
వెండి కిలో ధర	రూ. 108,900
వెండి ఒక గ్రాము	రూ.111.90

స్టేట్ బ్యాంకు వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం

నెల్లూరు (వైద్యం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో నగరంలోని చిన్నబజారు స్టేట్ బ్యాంక్ వీధిలో రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్ వేస్తున్నట్లు 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్ తెలిపారు. ఆ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసి జూలై రెండో వారంలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

అగ్నికుల క్షత్రియ విద్యార్థులకు

ప్రతిభా పురస్కారాల ప్రదానం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన అగ్నికుల క్షత్రియ విద్యార్థులకు నెల్లూరు జిల్లా అగ్రికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందచేశారు. నగరంలోని మూలాపేటలో ఉన్న వీరశైవ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు నగదుతోపాటు, జ్ఞాపికలు అందచేశారు. తమిళనాడు సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ రామకృష్ణన్, డాక్టర్ మల్లెంబాక వెంకట్రావు, సంఘం జిల్లా అధ్యక్షుడు చమ్మండి రాము, ప్రధాన కార్యదర్శి తిరువత్తూరు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు



గాయత్రీ హోమానికి హాజరైన హరిద్వార్ స్వామీజీలు



108 కుండముల గాయత్రీ హోమంలో భక్తులు

వైభవంగా గాయత్రీ మహాయజ్ఞం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : గాయత్రీ పరివార్ వ్యవస్థాపకురాలు మాతా భగవదీదేవి జన్మ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నగరంలోని సర్వోదయ కళాశాల మైదానంలో ఆదివారం 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కలశ యాత్ర జరిగింది. లోక కల్యాణం, వాతావరణ కాలుష్య నివారణ, దేశం శక్తివంతం, సుసంపన్నం కావాలనే మహాసంకల్పంతో 108 కుటుంబాలు భక్తిశ్రద్ధలతో గాయత్రీ హోమం నిర్వహించాయి. ఈ కార్యక్రమం జరిపించేందుకు హరిద్వార్ నుంచి స్వామీజీలు తరలివచ్చారు. జనసేన నాయకుడు గునుకుల కిషోర్ దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలివ్వాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు

నెల్లూరు (వైద్యం) జూన్ 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహా రావు డిమాండ్ చేశారు. నగరంలోని పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం సంఘం నెల్లూరు నగర మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. అనంతరం 34 మంది తో సంఘం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షకార్యదర్శులుగా ఆవుల పెంచలయ్య, కాయం శ్రీనివా సులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు

రోడ్డు పక్కన కార్మికుడి మృతి



రోడ్డు పక్కన మస్తాన్ మృతదేహం

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సెంటర్‌లో కేఫ్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. అల్లూరు మసీదు వీధికి చెందిన పఠాన్ మస్తాన్(47) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఆయన పనుల నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. స్టోన్‌హౌస్‌పేట సెంటర్‌లోని ఓ టీ దుకాణం వద్ద మస్తాన్ రోడ్డు పక్కన కుప్పకూలి పోయాడు. స్థానికులు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించ డంతో వారు అక్కడికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనారోగ్యంతోనే మస్తాన్ మృతి చెందినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మానవుడికి ఎంతో విలువైనది ఆరోగ్యం

- జీజీహెచ్ డాక్టర్ శ్రీకాంత్

నెల్లూరు (వైద్యం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రపంచంలో మానవునికి అత్యంత విలువైనది ఆరోగ్యమని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసిస్టెంట్ సివిల్ సర్జన్ ఎంబెట్టి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం నగరంలోని వియానీ హోంలో వైద్య శిబిరం నిర్వహించారు. రవి చిన్నపిల్లల ఆసుపత్రి, మెడికవర్, సాయి చేతన్ ఆసుపత్రి, రామ్స్ డెంటల్ కిడ్నీ వరల్డ్ ఆసుపత్రులు శిబిరంలో వైద్య సేవలు అందించాయి. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు తీసుకు వచ్చినా పేదలు, అనాథలకు సరియైన వైద్య సేవలు అందడం లేదన్నారు. ఈ నేపథ్యంలో వారికి వైద్య చికిత్సలు అందించేందుకు ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ సంఘం జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, వియానీ హోం సిస్టర్ రమా రూబియా, డాక్టర్ మాల్యాద్రి, డాక్టర్ ఝాన్సీరెడ్డి, డాక్టర్ సోనియా, డాక్టర్ నౌషియా, పీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, జయ తదిరులు పాల్గొన్నారు.

వాహనాలను లబ్ధిదారులకు అందించాలి : ఆర్‌పీఐ ధర్నా

నెల్లూరు(హరనాథపురం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : దళిత లబ్ధిదారుల కోసం తెప్పించి వారికి ఇవ్వకుండా నగరంలోని బుజబుజ నెల్లూరు వద్ద ఏళ్ల తరబడి ఉంచిన వాహనాలను వెంటనే లబ్ధిదారులకు అందించాలని ఆర్‌పీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు ఆదివారం సదరు వాహనాల వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.9.50కోట్ల విలువైన వాహనాలను 2018-19 సంవత్సరాల మధ్య దళిత లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉన్నా, ఎన్నికల కోడ్ సాకుతో కేటాయించలేదన్నారు. తరువాత వచ్చిన ప్రభుత్వం, అధికారులు కూడా వాటిని పంపిణీ చేయలేదని ఆరోపించారు. ఈ ధర్నాలో బత్తుల మధుసూదన్, దంపల సుబ్బారావు, అరికొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బుజబుజనెల్లూరులో వాహనాల వద్ద ధర్నా చేస్తున్న ఆర్‌పీఐ నాయకులు

జనసేన నాయకుల వారాహీ పూజ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సుపరిపాలనకు సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఆదివారం వారాహీ పూజ చేశారు. నగరంలోని 4వమైలు సెంటర్ బాలాజీ సన్ సిటీలో ఉన్న గంగమ్మ దేవాలయంలో పార్టీ నాయకులు పవన్, సుజిత దంపతులు ఈ పూజ జరిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలను అభివృద్ధి పరిచేలా సాగుతున్న పవన్ కల్యాణ్ సుపరిపాలనకు ఎటువంటి అడ్డంకులు రాకూడదని, ఆయన ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వారాహీ పూజలో జనసేన పార్టీ నాయకులు

అభివృద్ధిలో భాగస్వాములు కండి

- రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 20వ డివిజన్ కావేరి అవెన్యూలో రూ.27 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరాక ప్రజల అవసరాలకు తగ్గట్టు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదన్‌కుమార్‌రెడ్డి, ఖాదర్‌బాషా, మహేష్, శ్రీనివాసులు, మల్లి పాల్గొన్నారు.



రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

మురుగు కాలువ కాదు...

నీటిపారుదల కాలువ!

చెత్తతో నిండిన కోవూరులోని పీటర్స్ కాలువ



కోవూరు బజారు కూడలి పక్కన ఇనమడుగు, వేగూరు పరిసర ప్రాంత గ్రామాల పొలిమేరల్లో పొలాలకు సాగునీరందించే నీటిపారుదల కాలువ ఇది. బ్రిటీష్ కాలంలో ఏర్పడిన ఈ కాలువ అప్పటి బ్రిటీష్ అధికారి పీటర్స్ పేరుతో మనుగడలో ఉంది. వందలాది ఎకరాలకు సాగునీరందించే పారుదల కాలువ ఆక్రమణకు గురై చెత్తాచెదారం, వ్యర్థాలతో కుంచించుకుపోయి అధ్వానంగా తయారైంది. కాలువకు మరమ్మతులు చేయాల్సిందిగా రైతులు ఎప్పటి నుంచో ఇరిగేషన్ అధికారులను, ప్రభుత్వాన్ని, పాలకులను కోరుతున్నారు. ఎవరూ స్పందించిన పాపాన పోలేదు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో రూ.3 కోట్లతో అభివృద్ధి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, నుడా, మండల పరిషత్ నిధులు సుమారు రూ.3కోట్లతో మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పల్లెల్లో పర్యటించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అక్కడి పరిస్థితులను గుర్తించి నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో డ్రైన్లు, సీసీరోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పంచేడులో రూ.కోటి నుడా నిధులతో డ్రైన్ల నిర్మాణం, పెనుబల్లిలో అరుంధతివాడ, గిరిజనకాలనీకి మధ్య మిక్స్‌డ్ కాలనీలో రూ.5లక్షలతో గ్రావెల్‌రోడ్ల పనులు చేపట్టారు. ఈ కాలనీలో మొత్తం 16 వీధుల్లో గ్రావెల్ రోడ్లు ఏర్పాటుతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెనుబల్లి మిక్స్‌డ్ కాలనీలో వేస్తున్న గ్రావెల్ రోడ్డు

గిరిజనులకు ఉచిత హెల్త్‌కార్డుల పంపిణీ

వెంకటాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు పంచాయతీ పరిధిలో ఆదివారం సింహపురి వైద్య సేవాసమితి, జయభారత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గిరిజనులకు ఉచిత హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. జయభారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈపథకంలో భాగంగా హెల్త్‌కార్డులు ఉన్న గిరిజనులకు నెల్లూరు జయభారత్ హాస్పిటల్‌లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. జయభారత్ హాస్పిటల్ మేనేజర్ మనోహర్, బీజేపీ జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసా ద్‌నాయుడు, సీనియర్ నేతలు సుబ్బానా యుడు, నాగార్జున్‌రెడ్డి, స్థానిక నేతలు లఘంసాని వెంక య్యానాయుడు, తుమాటి మాధవ్, బుర్ర శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయభారత్ హాస్పిటల్ జీఎం గురుప్రసాద్

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యురాలు గంపల మంజులతో కలిసి ఆయన మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు, ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ జీవిత విశేషాలను వివరించారు. ఈ ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగేలా చట్టాలను సవరించి అమలు చేసిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. జూలై 1నుంచి బుచ్చిరెడ్డిపాళెంలో జరగనున్న జిల్లా కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలకు సంబంధించిన గోడపత్రికను ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు డీ.రాధయ్య, పీ.రాజయ్యలతో కలసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుబోయిన రాజా, కోలగట్ల సురేష్‌లు విలేకర్లతో మాటాడారు. జిల్లా ఆటో కార్మిక సంఘం కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు సాగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రూ.15వేలు వాహనమిత్ర పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు మాల్యాద్రి, దుర్గ, రమేష్, మల్లికార్జున, బాలకృష్ణ, శ్రీనివాసులు, నాగరాజు, వి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

3 కోళ్ల వ్యర్థాల వాహనాల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మడలంలోని దామర మడుగు, కాగులపాడు, పెనుబల్లి గ్రామాల పరిధిలోని చేపలగుంతల వద్ద కోళ్ల వ్యర్థాలు తరలి స్తున్న 3 వాహనా లను ఆదివారం ఉద యం పోలీసులు స్వాధీ నం చేసుకున్నారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. వాహనాల్లోని వ్యర్థాలను పెన్నాదిలో నిర్వీర్యం చేసినట్టు తెలిపారు. వ్యర్థాలను రవాణా చేసే వాహనాలపై ప్రజలు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

మండలాధ్యక్షుడికి ఘన సన్మానం

మనుబోలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్యను ఆదివారం జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ ఘనంగా సన్మానించారు. పొన్నూరు ఇటీవల మండలాధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పెనుబాక ప్రసాద్ ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పెనుబాక మహేష్, ఎస్‌కే ఖాదర్‌వల్లీ, పెనుబాక పవన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరును సన్మానిస్తున్న జనసైనికులు

లింగంగుంట శ్మశానాన్ని అభివృద్ధి చేస్తాం : బొబ్బేపల్లి



గిరిజనులతో కలిసి కంపచెట్లను తొలగిస్తున్న జనసేన నేతలు

వెంకటాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి పంచాయతీ లింగంగుంట గిరిజనుల శ్మశానాన్ని అభివృద్ధి చేస్తామని నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. మండలంలోని సర్వేపల్లి పంచాయతీ లింగంగుంట స్మశానాన్ని ఆదివారం గిరిజనులతో కలిసి పరిశిలించారు. అనంతరం స్మశానంలో ఉన్న కంపచెట్లను తొలగించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజనుల స్మశానాన్ని అభివృద్ధి చేయాలని అనేకసార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. తమ కూటమి ప్రభుత్వంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంత గిరిజనుల సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు పినిశెట్టి మహేష్, సందూరి శ్రీహరి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె స్టిక్కర్ల ఆవిష్కరణ

నెల్లూరు (వైద్యం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన స్టిక్కర్లను ఆదివారం నగరంలో ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయడంతోపాటు ఇతర డిమాండ్లతో చేపడుతున్న సమ్మెలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని, ఉద్యోగ విరమణ వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, దేశమూర్తి, శ్రీనివాసులు, సుజాతమ్మ, వజ్రమ్మ, భారతి, చెన్నయ్య, భాగ్యమ్మ, కొండమ్మ, లోకేష్ పాల్గొన్నారు.



సమ్మె స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు



జ్యోతిరూపంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

పొదలకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు జ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి వేడుకల్లో భాగంగా ప్రతి శుక్ర వారం రాత్రి పల్లకీసేవ నిర్వహిస్తుంటారు. ఈ పల్లకీ సేవ కార్యక్రమంలో ఓ భక్తుడు యాధృచికంగా తీసిన వీడియోలో అమ్మవారు జ్యోతిరూపంలో దర్శనం ఇచ్చారని పట్టణ ఆర్యవైశ్యులు తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని శుక్రవారం తీసిన వీడియోలో మాత్రం గర్భగుడిలో ఎటువంటి దీపం లేకపోయినా అమ్మవారి హృదయ భాగంలో జ్యోతి కనిపించడంతో భక్తులు భక్తిపారవశ్యంతో పూజలు చేశారు. రెండు రోజులుగా సోషల్ మీడియాలో ఈ వీడియో హల్‌చల్ చేసింది. దీంతో ఆదివారం కన్యకాపర మేశ్వరి ఆలయంలో అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారి ఆలయంలో జ్యోతి స్వరూపం



ఆకట్టుకున్న లక్షా గృహ దహన అలంకరణ

● వైభవంగా ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ద్రౌపదీ దేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు 5వరోజుకి చేరాయి. ఆదివారం భక్తులతో ఆలయం కళకళలాడింది. ఉదయం విశేష పూజలు, హోమాలు జరిగాయి. అనంతరం ద్రౌపదీ ధర్మరాజ సమేత శ్రీకృష్ణ స్వామికి విశేష అలంకారంతో చప్పర ఉత్సవం నిర్వహించారు. మహా భారతంలో అరణ్యవాసంలో ఉన్న పాండవులను తుద ముట్టించేందుకు దుష్టచతుష్టయం కుట్రలో భాగంగా పాండవులున్న లక్షా గృహాన్ని దహనం చేస్తారు. అక్కడి నుంచి సొరంగం తవ్వుకొని పాండవులు ప్రాణాలు రక్షించుకుంటారు. ఈ ఘట్టాన్ని తెలియజేసేలా చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం భగవద్గీత పారాయణం, రాత్రి మహాభారత ప్రవచనం జరిగాయి. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో జానకి పర్యవేక్షించారు.

సోమశిలలో 32.515 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 178 క్యూసె క్కుల ప్రవాహం వస్తుండగా 33.515 టీఎంసీలు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 850, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కులు సరఫరా చేస్తు న్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో యోగా తరగతులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయ కల్యాణ మండ పంలో ఆదివారం ఉదయం 6 గంటలకు యోగా తరగ తులు నిర్వహించారు. శిక్షకుడు సురేష్‌రెడ్డి యోగా సాధన, దాని ప్రాముఖ్యతను వివరించారు. దేవస్థానం సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లా డుతూ భక్తుల కోసం ప్రతీ ఆదివారం ఉదయం యోగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. భక్తులు దీనిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



పాఠశాల అభివృద్ధిపై మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డితో చర్చిస్తున్న మువ్వా రామలింగం

ఉదయగిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం పేర్కొన్నారు. ఆ పాఠశాలను ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచడంతో ఆదివారం ఉపాధ్యాయులతో కలిసి వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయడంతోపాటు ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఆవరణను చదును చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేసిన మన ఫౌండేషన్ అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డిని అభినందించారు. మరిన్ని సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని ఆయనకు మువ్వా సూచించారు. అలాగే ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణాలను, ఇతరత్రా పనులు పూర్తి చేసేందుకు త్వరలో నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సొమ్ము ఖర్చు.. సాగు భారం!

● ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులు ● దిగుబడులకు దక్కని గిట్టుబాటు ధర
● బీళ్లుగా మాగాణి భూములు ● రైతుల పాలిట 'వ్యథ'సాయం

ఉదయగిరి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని నమ్ము కుని రైతులు బతకలేని పరిస్థితి వచ్చేసింది. కానీ గత్యంతరం పరిస్థితుల్లో పెరిగిన పెట్టుబడులతో వారు బతుకుబండిని లాగుతున్నారు. గత రబీ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్‌లోనైనా పంటలు పండితే కొంతవరకైనా కష్టాలు తీరుతాయని ఆశతో ముందడుగు వేస్తున్నారు. ఏటేటా సాగు ఖర్చులు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● 'మద్దతు' కావాలి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 2.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారుల అంచనా. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో జొన్న, సజ్జ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, పసుపు, రాగి తదితర పంటలతోపాటు అరకొరగా వరిసాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఎరువులు, విత్తనాల ధరలతోపాటు ట్రాక్టర్ అద్దెలు కూడా రెట్టింపయ్యాయని, పండించిన పంట దిగుబడులకు మద్దతు ధర ఉంటే బాగుంటుందని రైతులు అంటున్నారు. కాగా కేంద్రం ప్రవేశపెట్టిన జీఎస్టీతో ధరలు పెరిగి రైతులు కుదేలవుతున్నారు. ప్రభుత్వాలు పురుగుమందులకు 18, ఎరువులకు 5 శాతం చొప్పున జీఎస్టీని వసూలు చేస్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు రైతులను ఇష్టానుసారంగా దోచుకుంటున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ల యజమానులు సైతం ధరలను పెంచేశారు. గొర్రు వేసేందుకు ఎకరాకు రూ.1,500లు, లోతు దుక్కులకు ఎకరాకు రూ.3,000లు, టిల్లర్ గంటకు రూ.1500ల చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక పశువుల ఎరువు దూరాన్ని బట్టి రూ.2,500 నుంచి రూ3,500లు పలుకుతోంది. మరోవైపు వ్యవసాయం కూలీల కూడా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పని చేస్తే ఆడవారికి రూ.350లు, మగవారికి రూ.600లు చెల్లించాల్సి వస్తుంది.



బీడుగా మాగాణి భూములు

● గిట్టుబాటు ధరలు లేక...

ఈ ఏడాది మినుము, కంది, శనగ పసుపు, పత్తి, పొగాకు పంటలతోపాటు బత్తాయి, మామిడి, సపోట, నేరేడు తదితర ఉద్యాన పంటలకు సైతం గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొంతమంది రైతులు చేసేదేమిలేక మినుము, శనగ, పొగాకు దిగుబడులను శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచారు. బత్తాయి రైతులు కోత కూలీలు కూడా కష్టమవడంతో చెట్లకే కాయలను వదిలేశారు. ఇక మామిడి రైతులు కన్నీటి పర్యంతమై కాయలను నేలపాలు చేస్తున్నారు. ఈ తరుణంలో బంగారం పండే భూములు బీళ్లుగా మారాయి.

● తగ్గిన రాయితీ

సేద్యంలో అధిక దిగుబడులు సాధించేందుకు నేల సారవం తంగా ఉండాలి. ఇందుకు పచ్చిరొట్ట పంటల సాగు కీలకం. వీటి విత్తన ధరల రాయితీలో ప్రభుత్వం కోత విధించింది. గతంలో పచ్చిరొట్ట పంటలు సాగును ప్రోత్సహించేందుకు 75 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఆ రాయితీని 50 శాతానికి పరిమితం చేశారు. దీంతో ఆదిలోనే అన్నదాతలకు పెట్టుబడి భారం పెరిగింది.

ఆశతోనే పంటల సాగు



గతేడాది మూడెకరాల్లో సుమారు రూ.4.50 లక్షల పెట్టుబడి పెట్టి పసుపు పంట సాగు చేశా. తెగుళ్ల కారణంగా పంట దిగుబడి తగ్గింది. దీనికితోడు బహిరంగ మార్కెట్‌లో క్వింటా పసుపు రూ.8,000 నుంచి రూ.9,000లు పలికింది. దీంతో నష్టం రాక.. ఆదాయమూ రాక.. రేయింబవళ్లు కష్టం మిగిలింది. ఆశ చావగా ఈ ఏడాది మరో రెండెకరాల్లో పసుపు సాగుకు చేశా.

- దేవసాని శ్రీనివాసులరెడ్డి, రైతు, కృష్ణారెడ్డిపల్లి

గిట్టుబాటు ధర కల్పించాలి



ఏడాదికేడాది పంటల సాగుకు పెట్టు బడులు రెట్టింపయ్యాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు పంటలకు గిట్టు బాటు ధర కల్పించి, రైతులకు రాయి తీలు పెంచాలి. ఎరువులు, పురుగు మం దులపై జీఎస్టీని తొలగించాలి. లేదంటే భవిష్యత్తులో వ్యవసాయం కనుమరుగయ్యే పరిస్థితులు రానున్నాయి.

- కాకు వెంకటయ్య, రైతు సంఘం నాయకులు




వాహనదారుడిని ప్రశ్నిస్తున్న పోలీసులు

వెంగళరావునగర్‌లో కార్డన్ సెర్చ్

● పత్రాలు లేని 45 బైకుల స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని వేదాయ పాళెం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న వెంగళరావు నగర్ ఏ-బ్లాక్‌లో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. నలుగురు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి సుమారు 460 ఇళ్లు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 45 బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు స్థానికేతరులను గుర్తించి వారి వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడానికి, చోరీ సొత్తు రికవరీకి, అనుమానస్పద వాహనాలు, వస్తువుల స్వాధీనానికి ఈ ఆపరేషన్లు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. ఈ తనిఖీల్లో వేదాయపాళెం, దర్గామిట్ట, సంతపేట, నవాబుపేట పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, రోశయ్య, దశరథ రామయ్య, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేపల్లి రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం



సర్వేపల్లి రిజర్వాయర్

వెంకటాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోసఫ్‌పేట వద్ద ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్‌లో చేపల వేటను నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ పరిశీలకుడు ఏ పొట్టెయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు తల్లి చేప గుడ్డుదశలో ఉం టుందన్నారు. రెండునెలల తర్వాత మత్స్య సంపద అభి వృద్ధి చెందడం వల్ల మత్స్యకారు లకు జీవనోపాధి లభిస్తుందన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని, వారి లైసెన్స్‌లు కూడా రద్దుచేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోజ్‌ధార్‌వీధికి చెందిన యువతి అదృశ్యంపై ఆమె తల్లి పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. వివరాల మేరకు.. రోజ్‌ధార్ వీధికి చెందిన గుండ్లపల్లి వాసంతి అనే యువతి గండిపాళెం మార్గంలో గల ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేందుకు వెళుతున్నానని శనివారం తల్లిదం డ్రులకు చెప్పింది. దీంతో సోదరుడు విఘ్నేష్ బైక్‌పై ఆ యువతిని పాఠశాల వద్ద వదిలి వెళ్లాడు. అయితే కొద్దిసేపు తరువాత సోదరుడు అక్కడికి రాగా ఆమె కనిపించలేదు. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పి చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టి బంధువులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆదివారం తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడిగా పొట్లూరి



పొట్లూరి శ్రీనివాసులు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 29 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా అభి వృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా పొట్లూరి శ్రీనివాసులు నియమి తులయ్యారు. ఆయన 30 సంవత్సరాలుగా గిరిజనుల అభివృద్ధికి చేస్తున్న సేవలను గుర్తించి కమిటీ సభ్యుడిగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యంగా గిరిజనులకు సేవలు అందించే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈవో కార్యాలయంలో ముజావర్లతో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు



కసుమూరు దర్గాలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ల పూజలు

వెంకటాచలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కసు మూరు మస్తాన్ వలి దర్గాను ఆదివారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు రూహుల్లా, ఖాజాసాహెబ్ దర్శించు కున్నారు. వీరికి దర్గా ఈవో షరీఫ్, కేర్ టేకర్ అస్లాం ఖాన్ స్వాగతం పలికి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దర్గా ముజావర్లు శాలువాలతో వారిని సన్మానించారు. పలు సమస్యలపై చర్చించారు. కసుమూరు దర్గా అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్య క్రమంలో దర్గా ముజావర్లు హనీఫ్, మున్వర్, అన్వర్, మౌలానా, ఆసిఫ్, ఆరీఫ్, యూసుఫ్ తదిత రులున్నారు.

ట్రాక్టర్,లారీ ఢీ : ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం



రోడ్డుపక్కకు దూసుకెళ్లిన ట్రాక్టర్

మనుబోలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ - లారీ ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై వీరంపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం వేకువ జామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఏఎస్ పేట మం డలం చిరమన గ్రామానికి చెందిన బోయమడుగుల శ్రీనువాసులు (55) భార్య, ముగ్గురు పిల్లలతో కొంతకాలంగా నెల్లూరులోని మూలాపేటలో ఉంటూ ఓ రైస్‌మిల్లులో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనేపథ్యంలో శనివారం నెల్లూరులోని రైస్‌మిల్లులో ట్రాక్టర్‌కు పొట్టు లోడ్ చేసుకుని సూళ్లూరుపేటకు వెళ్ళాడు. అక్కడ పొట్టు దించేసి నెల్లూరుకు తిరుగు ప్రయాణమ య్యాడు. ఆదివారం వేకువజామున 3గంటల సమయంలో మనుబోలు వీరంపల్లి క్రాస్‌రోడ్డు దాటుతుండగా అదేమార్గంలో చెన్నై నుంచి వ్యవసాయ సామాగ్రి లోడ్‌తో హైద్రాబాద్ వెళుతున్న లారీ ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పడంతో డ్రైవర్ శ్రీనువాసులు రోడ్డుపై పడిపోయాడు. దీంతో వెనుక వస్తున్న లారీ చక్రాల కిందపడి శ్రీనువాసులు మృతి చెందాడు. దీంతో ట్రాఫిక్‌కు నిలిచిపో యింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ. శివరాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీ క్షల నిమిత్తం గూడూ రు ఏరియా ఆసుపత్రికి తరలిం చారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరిం చారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వా ధీనం చేసుకుని, లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శ్రీనువాసులు (ఫైల్)

వివాహిత అదృశ్యంపై కేసు

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో వివాహిత అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు ఆదివారం కేసు నమో దు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని బృందావనం ప్రాంతంలో దండు అంజయ్య, రెడ్డమ్మ దంపతులు నివసిస్తు న్నారు. వారికి ముగ్గురు పిల్లలు. అంజయ్య ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నా డు. ఈ నెల 27వ తేదీన రెడ్డమ్మ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతుండగా భర్త మందలిం చాడు. దీంతో ఆమె గొడవపెట్టుకొని ఇంటి నుంచి వెళ్లిపోతానని భర్తకు చెప్పింది. అదేరోజు అంజయ్య తన తల్లి ఉంటున్న గరిమెనపెంట గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలోనే పెద్ద కుమారుడు గిరి ఫోన్ చేసి అమ్మ బ్యాగ్ తీసుకొని రైల్వేకోడూరుకు వెళుతున్నానని చెప్పి వెళ్లిపోయిందని తెలిపాడు. దీంతో అంజయ్య రైల్వేకోడూరుకు వెళ్లి భార్య ఆచూకీ కోసం బంధువులను విచారించగా అక్కడకు రాలేదని చెప్పడంతో ఆయన ఆదివారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌బైక్ ఢీకొని విద్యార్థినికి తీవ్ర గాయాలు



వైద్యశాలలో గుమిగూడిన కళాశాల విద్యార్థులు

ఉదయగిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మోటార్‌బైక్ ఢీకొని ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని మెయిన్ బజార్ పోలేరమ్మ మాను సమీపంలో ఆది వారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవ సాయ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదు వుతున్న జీ లాస్యప్రియతోపాటు మరో ఇద్దరు విద్యార్థినులు పట్టణానికి వచ్చి వారికి కావా ల్సిన వస్తువులను కొనుగోలు చేసి తిరిగి కళా శాలకు వెళుతున్నారు. ఈతరుణంలో పోలేర మ్మమాను సమీపానికి రాగానే బైక్‌పై వస్తున్న నల్లిపోగు దాసు వెనుకవైపు లాస్యప్రియను ఢీకొ ట్టాడు. ఈ ప్రమాదంలో ఆ విద్యార్థినికి తీవ్ర గాయాలు కాగా దాసుకు సైతం గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా, విద్యార్థి నికి ప్రమాదం జరగడంతో వైద్యశాలకు అధ్యాప కులు, తోటి విద్యార్థులు తరలివచ్చారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.

బాలికపై లైంగిక దాడి

● పరారీలో నిందితుడు

ఇందుకూరుపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లేబూరులో 4వ తరగతి చదువుతున్న ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడేవాడు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ బాలికను గట్టిగా అడగ డంతో జరిగిన విషయం తల్లిదండ్రులకు వివరించింది. దీంతో బాధజతులు పోలీసు లకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

కూటమిలో విభేదాలు

చెరువులో మట్టి తరలింపును అడ్డుకోవడంతో ఇరువర్గాల ఘర్షణ

టీడీపీ యువనేత సింగమనేని మనోజ్‌కు గాయాలు

జలదంకి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలో కూటమి పార్టీల నేతల విభేదాలు భగ్గుమన్నా యి. ఆదివారం టీడీపీ నేత, మాజీసర్పంచు నక్కా మాధవ రావు వర్గం స్థానిక చెరువులో నుంచి ట్రాక్టర్లతో మట్టి తరలిస్తుండగా మరో వర్గానికి చెందిన టీడీపీ యువనేత సింగమనేని మనోజ్, జనసేన నేత మధు తదితరులు అక్కడకు చేరుకుని మట్టి తరలింపును అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఇవరకు ఘర్షణకు జరిగింది. ఈ ఘర్షణలో టీడీపీ యువనేత సింగమనేని మనోజ్ తలకు గాయమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ విషయమై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించి చెరువులో మట్టిని తోలుతుంటే కొందరు పనిగట్టుకుని అడ్డ గించడం ఏమిటని మరోవర్గం కు చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచు నక్కా మాధవ రావు విమర్శిస్తున్నారు. గాయపడ్డ యువనేత మనోజ్‌ను మండల తెలుగుయువత అధ్యక్షుడు మునగాల తిరుమల రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర సోషల్‌మీడియా కో-కన్వీనర్ వడ్డే శ్రీనాథ్‌రెడ్డిలు కావలి ఏరియా వైద్యశాలలో పరామర్శించారు.



కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ యువనేత సింగమనేని మనోజ్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	228

కోడిగుడ్ల ధర (100): 575

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9200
వెండి కిలో ధర	రూ. 108900
వెండి ఒక గ్రాము	రూ.111.90

లోక్ అదాలత్‌పై అవగాహన పెంచుకోవాలి

అల్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌పై అవగాహన పెంచుకోవాలని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కక్షలు, కార్పణ్యాలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్ కేసులు, సత్వర న్యాయం కోసం ఎదురు చూసే కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకొని సమస్యలు లేని సమాజం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కావలిలో నిర్వహించే లోక్‌అదాలత్‌ను జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు ప్రాంత ప్రజలు వినియోగించుకొని సమస్యలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని తెలిపారు.

దళితవాడలో విద్యుత్ కష్టాలు!

● లో ఓల్టేజీతో కాలిపోతున్న గృహోపకరణాలు

కావలిరూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నాయపాలెం దళితవాడ వాసులకు లో ఓల్టేజీ సమస్యతో విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. దళితవాడలో సుమారు 80 కుటుంబాలు నివశిస్తున్నాయి. విద్యుత్ సరఫరాలో నిత్యం హెచ్చుతగ్గులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాన్లు, లైట్లు, తదితర గృహోపకరణాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అనేకమార్లు విద్యుత్ శాఖాధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఇంటూరికి రుణపడి ఉంటా !



పూరిమిట్ల గురునాథం

లింగసముద్రం, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని టీడీపీ మండల అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అదిష్ఠానం, ఎమ్మెల్యే తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అందరిని సమన్వయం చేసుకుని మండలంలో గ్రామస్థాయి నుంచి టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ అందుబాటులో ఉంటూ, కార్యకర్తల కోసం నిరంతరం పని చేసి పార్టీ అభివృద్ధికి దోహదపడతానన్నారు.

మరోసారి మండల అధ్యక్షుడిగా జనిగర్ల



జనిగర్ల నాగరాజు

గుడ్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : మారుమూల పల్లెలో జన్మించిన జనిగర్ల నాగరాజు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా మరోసారి నియమితులయ్యారు. దీంతో కూటమిలోని జనసేన నాయకులు సనిశెట్టి గిరిబాబు, అనిమిశెట్టి మాధవరావు, కొట్టే పుల్లయ్య, తికనం మారుతీరావు, ఆలా శివా, మెగిలిశెట్టిరాజ, బెడదం మాదవ, జనసేన వీర మహిళ సనిశెట్టి జాహ్నవి ప్రవలిక తధితరులు నాగరాజుకు అభినందనలు తెలిపారు. అలాగే తమ శ్రమను గుర్తించి మద్దతు పలికిన తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులకు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి నాగరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

హనుమంతరావు ఎంపికపై హర్షం

దగదర్తి(బిట్రగుంట), జూన్ 29(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం టీడీపీ అధ్యక్షుడిగా అల్లం హనుమంతరావును అధిష్ఠానం ఎంపిక చేయడంపై టీడీపీ కార్యకర్తలు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన హనుమంతరావును రెండవ సారి ఎన్నుకోవడంతో పాటు మండల ప్రధాన కార్యదర్శిగా ఇంజన్ కొండపనాయుడును ఎంపిక చేశారు. తమపై నమ్మకంతో పార్టీ మండల బాధ్యతలు అప్పగించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అంకమ్మకు పొంగళ్లు

కొండాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడవళ్లూరు పంచాయతీ పెద్దూరులో వెలసి ఉన్న పద్మాలగిరి అంకమ్మ, గుండ్లపల్లి నాగార్పమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో ప్రతి ఆదివారం భక్తులు పొంగళ్ల పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ విధంగా పూజలు చేస్తే తమ కుటంబాలకు మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.

డంపింగ్ యార్డులుగా

పట్టణ శివారు రోడ్లు!

● పట్టించుకోని మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు



రోడ్డు పక్కన చెత్త, చెదారంతోపాటు కొబ్బరి బొండాలు



పెద్దపవని రోడ్డు పక్కన చెత్తాచెదారం కుప్పలు

కావలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్కడా రోడ్లపై చెత్తా చెదారం కనిపించకూడదని అధికారులు చెపుతున్నారు. అయితే పట్టణంలోకి ప్రవేశించే నాలుగు దిశల రోడ్ల శివారుల్లో రోడ్ల మార్జిన్‌ను మినీ డంపింగ్ యార్డులుగా మారాయి. కుప్పలుగా పోస్తున్న చెత్తా చెదారంతో వాహనదారులు రోడ్డు మార్జిన్ దిగలేని పరిస్థితి నెలకొంది. అయినా సంబంధిత ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణ లు ఉన్నాయి. పట్టణంలోకి ప్రవేశించే కావలి-పెద్దపవని రోడ్డు, కావలి-ఉదయగిరి రోడ్డు, కావలి-తుమ్మలపెంట రోడ్డు, కావలి -ముసునూరు రోడ్డు ఈ నాలుగు రోడ్ల మార్గాల వద్ద చెత్తా చెదారాలను వేస్తున్నారు. అలాగే పెద్దపవని రోడ్డు నుంచి ఉదయగిరి రోడ్డులోకి ప్రవేశించే బైపాస్ రోడ్డులో కూడా చెత్తా చెదారం వేస్తుండటంతో అవి పట్టణంలోకి ప్రవేశించే ప్రజలకు తొలుత స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా కొబ్బరి బొండాల వ్యాపారులు వాడిన బొండాలను తీసుకెళ్లి పట్టణ శివారులలో రోడ్ల వెం బడి వేస్తున్నారు. వర్షం పడితే అవి కాలువలోకి చేరి వర్షపునీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి. కొంత మంది చిరు వ్యాపారులు తమ దుకాణాల వద్ద ఉన్న చెత్తా చెదారాలను కూడా శివారులలో వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇళ్ల మరమ్మతులు చేసుకునే వారు కూడా వేస్ట్ మెటీరియల్‌ను తీసుకెళ్లి వేస్తున్నారు. దీంతో రోడ్ల వెంబడి అపరిశుభ్రంగా తయా రవుతోంది. విశాలమైన రోడ్లు ఉండి కూడా వాటి వెంబడి చెత్తాచెదారం ఉండటంతో ఆరోడ్లకు ఉన్న లుక్ తగ్గిపోతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్ల వెంబడి చెత్తా చెదారం వేయకుండా తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రోడ్డుకు అతుకులు వేశారు..

వ్యర్థాలను అక్కడే వదిలేశారు!



గాంధీనగర్ కాలనీలో రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు

కావలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం గాంధీనగర్ మెయిన్ రోడ్డుకు ఇటీవల ప్యాచ్‌వర్క్‌లు వేసి వేస్ట్ మెటీరియల్ రోడ్డుపైనే వదిలేశారు. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్యాచ్‌వర్క్‌లు వేసిన కాంట్రాక్టర్ రోడ్డును పగులకొట్టిన వేస్ట్ మెటీరియల్‌ను అక్కడ నుంచి తరలించాల్సి ఉంది. కానీ ఆయన మట్టిని తొలగించకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై ఉన్న ఆ మట్టి కుప్పలతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు తొలగింపచేసి ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగించాల్సి ఉంది.

రోటరీక్లబ్ ద్వారా విస్తృత సేవలు



మాట్లాడుతున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సమావేశానికి హాజరైన రొటేరియన్లు, ప్రజలు

కావలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కావలి రోటరీక్లబ్ ద్వారా విస్తృత సేవలు అందిస్తామని నూతనంగా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఏ.రమేష్‌రెడ్డి తెలిపారు. రోటరీక్లబ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని నారాయణ కల్యాణ మండపంలో రోటరీక్లబ్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రోటరీక్లబ్ ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను గురించి చర్చించారు. అనంతరం నూతన కమిటీ ఎంపిక జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎంపికైన ఏ.రమేష్ రెడ్డి మాట్లాడుతూ రోటరీక్లబ్ తీసుకున్న ఎలాంటి నిర్ణయాలనైనా అమలు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. రూ.40 లక్షలు తన సొంత నిధులతో స్వర్ణధా మంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేవిధంగా చర్యలు చేపడతానన్నారు.

● **నూతన కమిటీ**

అధ్యక్షుడిగా ఏ.రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కేవీ.కృష్ణారెడ్డి, ఎస్.శివకుమార్, కార్యదర్శిగా జీ.రమేష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జీ.సురేష్ రెడ్డి, కోశాధికారిగా కే.హరిప్రసాద్‌రెడ్డి, కార్యనిర్వహకుడిగా ఎన్.ప్రతాప్‌రెడ్డి, తదితర సభ్యులను ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉలవపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు సమీపంలో రాజుపాలెం అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన రావూరు కోటేశ్వరరావు నెల్లూరు వైపు వెళ్లే రోడ్డు మార్గంలో బైక్‌పై వెళుతూ రాజుపాలెం జంక్షన్ వద్ద రోడ్డు దాటే క్రమంలో అదే మార్గంలో వెళుతున్న మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలు కాగా, కోటేశ్వరరావు తలకు బలమైన గాయాలు తగలడంతో ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. మరో వ్యక్తిని ఉలవపాడు ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించారు. చికిత్స అనంతరం అతను అక్కడి నుంచి వెళ్లినట్లు తిలిసింది. అతని వివరాలు తెలియలేదు.

రెవెన్యూ క్రీడలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ

కందుకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు డివిజన్ స్థాయిలో రెవెన్యూ సిబ్బందికి క్రీడా పోటీలను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ఆదివారం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు కూడా అవకాశం లభిస్తుందని, తద్వారా విజేతలుగా నిలవాలని సూచించారు.

మన గ్రోమోర్ కేంద్రం ప్రారంభం

వలటివారిపాలెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న పొట్టేళ్ల పెదఅంజయ్య కాంప్లెక్స్‌లో ఆదివారం మన గ్రోమోర్ కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా మేనేజర్ శంకరరెడ్డి మాట్లాడుతూ కోరమాండల్ కంపెనీ ద్వారా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, స్ప్రేయర్లు, పశువుల దాణా రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అలాగే వాహనాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా మార్కెటింగ్ మేనేజర్ గోపి, ఏరియా ఆడిటర్‌లు వసంత, ప్రసాద్, మేనేజర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఇంటూరి

కందుకూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు జూలై 2 నుంచి ఇంటింటి ప్రచారంపై చర్చించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌ను ప్రత్యేకంగా కలిసినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.

రోడ్డు పక్కన కార్మికుడి మృతి



రోడ్డు పక్కన మస్తాన్ మృతదేహం

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సెంటర్‌లో కేఫ్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. అల్లూరు మసీదు వీధికి చెందిన పఠాన్ మస్తాన్(47) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఆయన పనుల నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. స్టోన్‌హౌస్‌పేట సెంటర్‌లోని ఓ టీ దుకాణం వద్ద మస్తాన్ రోడ్డు పక్కన కుప్పకూలి పోయాడు. స్థానికులు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనారోగ్యంతోనే మస్తాన్ మృతిచెందినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వంతెనపై ఇసుక తొలగింపు



వంతెనపై పేరుకుపోయిన ఇసుకను డోజర్‌తో తీయిస్తున్న ఎస్ఐ

సంగం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సంగం పాత ఆనకట్ట కనిగిరి ప్రధాన కాలువ వంతెన ముఖ ద్వారం వద్ద వంతెనపై వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఇసుకను ఎస్ఐ రాజేష్ ఆదివారం డోజర్‌తో తీయించారు. విరువూరు, సూరాయపాళెం నుంచి సంగం వైపు అధిక లోడుతో వచ్చే టిప్పర్ల నుంచి ఇసుక వంతెన ముఖద్వారం, వంతెనపై పడి పేరుకుపోయిది. దీంతో వంతెనపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో ఎస్ఐ రాజేష్ డోజర్‌తో ఇసుకను తొలగించారు. దీంతో స్థానికులు, ద్విచక్ర వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధ్యానంతో వ్యాధులు దూరం

ఆత్మకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు శరీరంలో నాడిశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయని సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ చంద్రా విజయమ్మ తెలిపారు. ఆదివారం పట్టణంలోని షిర్డీ సాయి పిరమిడ్ ధ్యానకేంద్రంలో మౌన ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉప యుక్తమని తెలిపారు. ధ్యాన సాధకులు సజ్జన సాంగత్యంతో పాటు ఆత్మవిజ్ఞాన పుస్తకాలు చదవాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్లు, ధ్యానసాధకులు పాల్గొన్నారు.

విశ్వ కల్యాణం కోసం దానం చేస్తే సంపద వృద్ధి

వింజమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విశ్వ కల్యాణం కోసం దానం చేస్తే సంపద వృద్ధి చెందుతుందని గుంటూరు పిరమిడ్ మాస్టర్ బద్రీ నారాయణ అన్నారు. స్థానిక వేద వ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం ద్వారా సాధించలేనిది ఏదీలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధ్యానులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

సీతారామపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వింజమూరులోని నేతాజీ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా జాబ్‌మేళాను మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమవారం ఉదయం 9గంటల నుంచి పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఆసక్తి కలిగిన యువకులు హెచ్‌టిటిపిఎస్:// ఎన్ఏఐపియు ఎన్వైఏఎం. ఏపి.జీఓవి.ఇన్/ యూజర్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ లింకులో నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫారం, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో జాబ్‌మేళాలో పాల్గొనాలన్నారు. ఈకార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, దేవర వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, తోట మనోజ్, వెంగళశెట్టి వెంకట్రావ్, తోట ఏడుకొండలు, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతం చేయండి

ఆత్మకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయ పునర్నిర్మాణం జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే మహా కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు రామయ్యస్వామి తెలిపారు. ఆత్మకూరులో మహిళా భక్తులతో కుంభాభిషేక మహోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భక్తులు ప్రతిరోజూ విష్ణు సహస్ర నామ జపం, భజనలు చేయాలని కోరారు. అలఘునాథుని కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి, కెవి శేషరెడ్డి, కుడుముల సుధాకరరెడ్డి, సోమవరపు యానాదిరెడ్డి, ఏపి వెంకటరెడ్డి, అచోలు నారసింహారెడ్డి, కేతా మస్తాన్‌రెడ్డి, రాపల్లి ప్రసాద్‌రెడ్డి, పురప్రముఖులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం : మాజీ ఎమ్మెల్యే మేకపాటి



రఫీని సన్మానిస్తున్న మేకపాటి, చెంచలబాబు

ఉదయగిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమేనని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయుడు షేక్ రఫీ ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం రఫీని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే స్థానిక బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ నాగయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, విశ్రాంత ఎంఈవోలు జీ.ఓబులరెడ్డి, అల్లాభక్షు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగార్పమ్మకు పూజలు



నాగవరపమ్మకు పూజలు చేస్తున్న అర్చకుడు

సంగం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మూల విరాట్‌కు అభిషేకాలు, పూలం గిసేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

●**ఉదయగిరి :** మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న నాగారప్పమ్మ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. చివరిరోజు మహిళా భక్తులు పొంగళ్ల సామగ్రితో బాణాసంచా పేలుళ్ల నడుమ గ్రామ పుర వీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులంతా సహపంక్తి భోజనాలు చేశారు.

వైభవంగా అంకాళమ్మ ఉత్సవాలు


వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఉన్న అంకాళమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. నిలుపు ఘట్టపు కడవ మహోత్సవాలు దేవర ఇంటి నుంచి పసుపు, కుంకుమ, చీర, సారె కావిట్లు ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సింహ వాహనంపై గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు కాయా కర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరు కావడంతో ఆలయ అర్చకులు, నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సన్మానించి అభినందనలు తెలిపారు.

ముగిసిన అచ్చమాంబ పేరంటాలు ఉత్సవాలు



అమ్మవారికి పొంగళ్లు వండుతున్న భక్తులు

మర్రిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పొంగూరు మాలిచేలల్లో వెలసిన అచ్చమాంబ తల్లి పేరంటాలు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 30 జూన్ 2025


మనవడు వేహంత్‌తో పాటు రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న మోహన్

'కలంకారీ మోహన్'కు రాష్ట్రపతి అభినందన

కలంకారీ కళాకారుడిగా విశేష గుర్తింపు పొందిన తలిశెట్టి మోహన్, ఆయన మనవడు వేహంత్‌ను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అభినందించారు. శ్రీకాళహస్తిలోని కంఠావీధికి చెందిన మోహన్ కలంకారీ చిత్రాలు రూపొందించడంలో ప్రసిద్ధులు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కలంకారి విభాగంలో అవార్డు అందుకున్నారు. గత నెలలో ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో వివిధ హస్తకళలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా కలంకారిలో 50 మందికి మూడు రోజులు పాటు శిక్షణ ఇవ్వాలని మోహన్‌ను అధికారులు ఆహ్వానించారు. ఆయన మనవడు వేహంత్ అమెరికాలో తల్లిదండ్రుల వద్ద ఉంటూ వారసత్వంగా ఈ కళలో ప్రావీణ్యం పొందాడు. చిన్నతనం నుంచే కలంకారీ చిత్రాలు గీయడంలో పట్టు సాధించాడు. ఆరో తరగతి చదువుతున్న ఈ బాలుడు అమెరికా నుంచి ఇటీవల ఇండియాకు వచ్చి తాతతోపాటు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యాడు. ఈక్రమంలో శనివారం రాష్ట్రపతి భవన్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. కలంకారీ శిక్షణ ఇచ్చిన మోహన్‌ను, బాల్యంలోనే ప్రతిభ చాటుతున్న వేహంత్‌ను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అభినందించారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి


రిజర్వు ఫారెస్టులో చదును చేసిన భూమి

గుట్టనూ వదల్లేదు

- రిజర్వు ఫారెస్ట్‌ను రాత్రిళ్లు చదును చేస్తున్న ఆక్రమణదారు

ప్రభుత్వ, డీకేటీ భూముల అయిపోయినట్లున్నాయి. గుట్టలపై ఆక్రమణదారు కన్నుపడింది. ఇలా రిజర్వు ఫారెస్టులో ఎక్స్‌కవేటరుతో చదును చేసి ఆక్రమణకు మొదలు పెట్టారు చంద్రగిరి మండలం గంగుడుపల్లెకు చెందిన వ్యక్తి. ఆ గ్రామానికి సమీపం, ప్రధాన రహదారికి ఆనుకొని అనుప్పల్లి- చంద్రగిరి రహదారి పక్కనే రిజర్వు ఫారెస్ట్ ఉంది. ఆ అటవీ ప్రాంతాన్ని మూడు రోజులుగా రాత్రి వేళల్లో ఎక్స్‌వేటర్‌తో చదును చేస్తున్నారాయన. తమ పశువులు, గొర్రెలు, మేకలు మేపుకోవడానికి కనీసం రిజర్వు ఫారెస్ట్‌నూ వదలకుండా కబ్జా చేస్తున్నారంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై సంబంధిత అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఆ దారిలో భూముల విలువ విపరీతంగా ఉండటంతో కబ్జాదారుడు ఏకంగా రిజర్వు ఫారెస్ట్‌నే ఆక్రమించే పనిలో పడ్డారు. ఇప్పటికే సుమారు రెండు ఎకరాలు చదును చేఇనట్లు సమాచారం. రిజర్వు ఫారెస్ట్ నుంచి గ్రామస్తులు పొయ్యిలోకి ఎండు కట్టెలను తీసుకొస్తేనే పట్టుకునే అధికారులు.. ఇప్పుడు ఏకంగా భూమినే చదును చేస్తుంటే పట్టించుకోకపోవడం ఏంటని స్థానికులు నిలదీస్తున్నారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

సిబ్బంది లేకుంటే గస్తీ ఎలా?



ప్రతి ఆరు బోగీలకు ఇద్దరు జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ సిబ్బంది భద్రతా విధుల్లో ఉండాలి. కానీ, 24 బోగీలకు కలిపి కేవలం ఇద్దరే ఉంటున్నారు.

- రైల్వేలో గస్తీ సిబ్బంది కొరతకు ఇదే నిదర్శనం. ఇది రైళ్లలో చోరీలు, దోపిడీలపై ప్రభావం చూపుతోంది.

- రైల్వేలో పీడిస్తున్న కొరత
- తిరుపతి సబ్ డివిజన్‌లో 39 కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీ
- పెరుగుతున్న చోరీలు, దోపిడీలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల రైళ్లలో చోరీలు, దోపిడీలు పెరిగాయి. చిత్తూరు రూరల్ మండలం సిద్దంపల్లి రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ నెల 26వ తేది తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో రైల్వే సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఎక్స్‌ప్రెస్ రైలులో దోపిడీ చేశారు. రెండు బోగీల్లోకి చొరబడిన దుండగులు నలుగురు ప్రయాణికుల నుంచి 70 గ్రాముల బంగారు నగలు కాజేశారు. మే 2న చంద్రగిరి మండలం ముంగిలిపట్టు రైల్వే స్టేషన్ పరిధిలో హోమ్ సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్‌కు గురైంది. రెడ్ లైటు వెలుగుతుండడంతో రైలు ఆగింది. ఇంతలోనే దుండగులు బోగీలోకి దూరి ఇద్దరు మహిళల మెడల్లో బంగారు గొలుసులు లాక్కెళ్లారు. తాజాగా శనివారం అర్ధ రాత్రి విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు వద్ద దుండగులు చోరీకి యత్నించారు. ఇలా ఇటీవల రైళ్లల్లో చోరీలు, దోపిడీలు పెరుగుతున్నాయి. దాదాపు ఒకే తరహాలో దుండగులు దోపిడీకి పాల్పడుతున్నారు. గస్తీ సిబ్బంది తగు సంఖ్యలో లేకపోవడంతోనూ ఈ ఘటనలు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఎందుకంటే.. రైల్లో గస్తీ నిర్వహించే పోలీసులు.. బోగీల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే విచారించాలి. అదుపులోకి తీసుకోవాలి. కానీ రైలుకంతా కలిపి ఇద్దరే ఉంటున్నారు. దీంతో వీరు పూర్తిస్థాయిలో గస్తీపై దృష్టి పెట్టలేకున్నట్లు సమాచారం. గత 20 సంవత్సరాలుగా పదవీ విరమణతో ఖాళీ అవుతున్న స్థానాలు భర్తీ కావడం లేదని, సివిల్ పోలీసు నుంచి డిప్యుటేషన్‌పై రైల్వే శాఖకు రావడానికి చాలామంది అయిష్టత చూపుతున్నారని తెలుస్తోంది.

ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

రైల్వే శాఖలో సిబ్బంది కొరత వాస్తవమే. అయితే తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ ఆధ్వర్యంలో ఉన్న సిబ్బందితో ప్రయాణికుల భద్రత ధ్యేయంగా గట్టిగా బందోబస్తు చేస్తున్నాం. ఇటీవల రైలు దోపిడీలు, చోరీలను సవాల్‌గా తీసుకుని మరింత పకడ్బందీగా పని చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి పూట అన్ని బోగీలు తనిఖీ చేసి నివేదికలు తెప్పించుకుంటున్నాం. అనుమానితుల వేలిముద్రలు సేకరించే పని ముమ్మరం చేస్తున్నాం.

- ఆశీర్వాదం, రైల్వే జీఆర్పీఎఫ్ సీఐ, తిరుపతి

తిరుపతి సబ్ డివిజన్‌లో..

ప్రధానంగా తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో ఏఎస్‌ఐలు ఒకరంటే ఒకరు కూడా లేరు. నలుగురు ఎస్‌ఐలకుగాను ఇద్దరే ఉన్నారు. ఇక 10 మంది హెడ్ కానిస్టేబుళ్లకు గాను సివిల్ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ముగ్గురే పనిచేస్తున్నారు. 49 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా, పనిచేసేది పది మందే. వీరికి కోర్టు డ్యూటీలు, సమన్లు ఇవ్వడం, శవ పంచనామాలు నిర్వహించడం వంటి ఇతరత్రా డ్యూటీలూ ఉన్నాయి. దీంతో రైళ్లలో విధులు నిర్వహించడానికి అవసరమైన సిబ్బంది లేకుండా పోయారు. దీంతో దుండగులు సిగ్నల్ వ్యవస్థలు ట్యాంపరింగ్ చేయడం, రైళ్లలో ప్రయాణికుల్లా ప్రయాణించి దోపిడీలకు పాల్పడుతున్నారు.

నాటు తుపాకి స్వాధీనం


పోలీసుల అదుపులో గోవిందయ్య

నాగలాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం కస్తూరినాయుడుకండ్రిగలో పోలీసులు నాటుతుపాకి స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సునీల్ ప్రకారం.. ఆదివారం ఉదయం గ్రామంలో పోలీసులు నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ఎస్.గోవిందయ్య వద్ద నాటుతుపాకిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులో తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేవీబీపురం మండలం అంజూరు నుంచి వలసవచ్చి స్థిరపడ్డాడు. ఇతడిపై 20 ఏళ్ల కిందట శ్రీకాళహస్తి అటవీ రేంజ్ పరిధిలో వన్యప్రాణి విభాగం కింద కేసు నమోదైంది.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌చార్జి పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఇన్‌చార్జి పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి ఈఈ రామ్మోహన్, మదనపల్లె ఈఈ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో కౌన్సెలింగ్ జరిగింది. ఉమ్మడి జిల్లాలో 664 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉండగా ఆదివారం 400 మందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగిలినవారికి సోమవారం ఉంటుంది. కాగా, కౌన్సెలింగ్ ప్రారంభంలో ఉద్యోగులకు, అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఖాళీగా ఉన్న ప్రాంతాల వివరాలు ప్రదర్శించాలని ఉద్యోగులు కోరారు. ఖాళీగా ఉన్నా.. తాము కోరుకున్న చోటు కాకుండా దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని ఆరోపిస్తూ కొంతసేపు ఆందోళన చేశారు. ఖాళీలను ప్రదర్శించడానికి పెద్ద డిజిటల్ స్క్రీన్లు తమ వద్ద లేవని అధికారులు చెప్పడంతో ఉద్యోగులు అసంతృప్తిగానే కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

మహిళా పోలీసుల కౌన్సెలింగ్‌లో రగడ

చిత్తూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా పోలీసుల బదిలీ కౌన్సెలింగ్‌లో రగడ చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక పీటీసీ కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తూ ఐదేళ్ల సర్వీసు పూర్తయిన సుమారు 1,200 మంది మహిళా పోలీసులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. ఎస్పీ మణికంఠ పర్యవేక్షణలో ఆన్‌లైన్ ద్వారా ఖాళీల వివరాలను చూపించి బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. తొలుత అంధులు, విడోలు, స్పౌజ్, దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ కేటగిరీల్లోని వారికి బదిలీలు చేపట్టారు. ఇది సరికాదని, ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అరుపులు, కేకలు వేయడంతో ఎస్పీ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అన్ని జిల్లాల్లో ఆఫ్‌లైన్‌లో బదిలీలు చేపట్టారని, పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్ ప్రక్రియ చేస్తున్నామని చెప్పారు. ఆందోళనలు చేయాలనుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దాంతో అందరూ మిన్నకుండిపోయారు. ఆదివారం మిగిలిన వారికి సోమవారం కూడా బదిలీ కౌన్సెలింగ్ జరుగుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

కళ్లు 'కాయలు'కాసేలా..!

- గుజ్జు పరిశ్రమల వద్ద మామిడి రైతుల నిరీక్షణ
- వేచి ఉండలేక రోడ్లపై పారబోస్తున్న వైనం


కేవీబీపురంలో బారులు తీరిన మామిడి లోడు ట్రాక్టర్లు

సత్యవేడు/కేవీబీపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దిగుబడులు బాగున్నా ధరల్లేక మామిడి రైతులు నష్టాల బాటపడుతున్నారు. ప్రధానంగా తోతాపురి రకం కొనేవారు లేక కుదేలవుతున్నారు. రవాణా ఖర్చులు కూడా లేక కాయలు తోటల్లోనే మాగి నేల రాలుతున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో నారాయణవనం, కేవీబీపురం, బుచ్చినాయుడు కండ్రిగ, సత్యవేడులో జ్యూస్ ఫ్యాక్టరీలకు ఎగుమతి చేసేవారు. మార్కెట్‌లో డిమాండు లేకపోవడంతో ఫ్యాక్టరీలు కొనుగోలుకు విముఖత చూపిస్తున్నాయి. దీంతో కనీసం పెట్టుబడి ఖర్చులయినా వస్తాయా లేదా అని రైతులు ఆందోళనలో ఉన్నారు. నియోజకవర్గంలోని జ్యూస్ ఫ్యాక్టరీలకు పొరుగు జిల్లాల నుంచి కూడా మామిడి రైతులు తరలిరావడంతో ఫ్యాక్టరీల వద్ద కిలోమీటర్ల మేర తోతాపురితో వచ్చిన వాహనాలు బారులు తీరుతున్నాయి. అన్‌లోడింగ్‌కు రెండు, మూడు రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. కేవీబీపురంలో మూడు నాలుగు రోజులు కూడా నిరీక్షిస్తున్నారు. కొందరు నిరీక్షించ లేక రోడ్డుపైనే కాయలు పడేసి వెళ్లిపోతున్నారు.


నారాయణవనంలో..

నియోజకవర్గంలో మామిడి పరిస్థితి

నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 2500 హెక్టార్లలో మామిడి పండిస్తారు. ఏటా 8వేల మెట్రిక్ టన్నుల నుండి 12 వేల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి అవుతోంది. ఇందులో తోతాపురి సుమారుగా 4వేల నుంచి 5 వేల మెట్రిక్ టన్నులున్నాయి ప్రస్తుతం సత్యవేడులోని కాప్రికార్న్ జ్యూస్ ఫ్యాక్టరీలో నాణ్యమైన మామిడి మాత్రమే తీసుకుంటున్నారు. ఇక్కడ రైతుల నుంచి రోజుకు 100 నుంచి 120 టన్నుల వరకు కొనుగోలు చేస్తున్నారు. నారాయణవనం, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురం జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద సమస్య భిన్నంగా ఉంది. దిగుమతి కోసం ఎక్కువ రోజులు ఎదురు చూడాల్సి వస్తోంది.


రోడ్డుపై పడేసిన మామిడికాయల్ని తింటున్న పశువులు

టీటీడీ సేవలు ఎలా ఉన్నాయ్!

- కొనసాగుతున్న భక్తుల అభిప్రాయ సేకరణ

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ భక్తులకు అందిస్తున్న వివిధ సేవలను మరింత మెరుగుపరిచేందుకు భక్తుల అభిప్రాయాలను సేకరించే ఫీడ్ బ్యాక్ సర్వేను కొనసాగిస్తోంది. ఐవీఆర్ఎస్, వాట్సాప్ ద్వారా ఈ-సర్వే, శ్రీవారిసేవకుల ద్వారా మాన్యువల్ సర్వేలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఐవీఆర్‌స్ ఎలక్ట్రానిక్ సర్వే విధానం ద్వారా భక్తులు తిరుమలయాత్ర పూర్తి అనుభవం, అన్నప్రసాదం, కల్యాణకట్ట, శ్రీవారి ఆలయం, వసతి, క్యూలైన్ల నిర్వహణ, లగేజీ కౌంటర్లపై మొత్తం 16 ప్రశ్నలతో తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు.

వాట్సాప్: తిరుమల, తిరుపతిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను భక్తులు తమ మొబైల్‌తో స్కాన్ చేస్తే '93993 99399' వాట్సాప్ నెంబరు ఓపెన్ అవుతుంది. ఇందులో టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ ద్వారా భక్తులు తమ పేరుతో, విభాగం (అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు వంటివి) ఎంచుకుని తమ ఫీడ్‌బ్యాక్ ఇవ్వచ్చు.



శ్రీవారి సేవకుల ద్వారా

తిరుమల, తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రత్యక్షంగా శ్రీవారి సేవకులతో అభిప్రాయ సేకరణ జరుగుతోంది. టీటీడీ రూపొందించిన ప్రశ్నావళితో కూడిన అప్లికేషన్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని భక్తుల అభిప్రాయలను సేకరిస్తారు. త్వరలోనే టీటీడీ మొబైల్ యాప్, టీటీడీ బుకింగ్ పోర్టల్ నుంచీ అభిప్రాయ సేకరణ ప్రారంభించనున్నారు. భక్తుల అభిప్రాయాలను క్రోడీకరించి సేవలను మరింత మెరుగుపరిచే దిశగా టీటీడీ ఈ విధానాన్ని చేపట్టింది.

నకిలీ స్టిక్కరేస్తే అంతే..!



తిరుపతి(నేరవిభాగం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు, జర్నలిస్టు, టీటీడీ ఉద్యోగులు కాకున్నా.. మీ వాహనాలకు ఆ స్టిక్కర్లేసుకుని తిరుగుతున్నారా? అయితే జాగ్రత్త.. ఇలాంటి వాహనాలపై పోలీసులు దృష్టి పెట్టారు. తొలి దశలో స్టిక్కర్లు తొలగించి, కౌన్సెలింగ్ ఇస్తారు. రెండోసారీ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు. కొందరైతే మద్యం తాగి రోడ్లపైకి రావడం, పోలీసుల తనిఖీల్లో ప్రెస్ అని చెప్పి వెళ్లిపోతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఎస్పీ హర్షవర్ధనరాజు స్పందించారు. నకిలీ స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్న వారిని గుర్తించి తొలగించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 41 ప్రెస్, 54 పోలీసు, 31 టీటీడీ స్టిక్కర్లను పోలీసులు తొలగించారు.

భక్తులూ.. ఆగి వెళ్లండి


తిరుమలలో ఆదివారం కారు నుంచి వచ్చిన మంటలను ఆర్పుతున్న సిబ్బంది

తిరుమల కొండకు వచ్చే భక్తులూ ఒక మాట. తిరుపతిలో కాసేపు ఆగి వెళ్లండి.. అంటూ పోలీసులు సూచిస్తున్నారు. 'దూర ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో తిరుమలకు వచ్చే భక్తులు తిరుపతిలో రెండు గంటల పాటు విశ్రాంతి తీసుకోండి. దీనివల్ల కార్ల ఇంజన్ చల్లబడుతుంది. వాహనాలు నడుపుతున్న వ్యక్తులకూ నిద్రమత్తు ఉండదు. ఇలా చేయడం వల్ల ప్రమాదాలను నివారించొచ్చు' అని చెబుతున్నారు. తిరుమలకు వచ్చే కారు ఆదివారం జీఎన్సీ టోల్‌గేట్ వద్ద ఇంజన్‌లో నుంచి పొగలు రావడంతో మంటలు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో భక్తులకు సూచనలు చేస్తూ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. రాత్రి సమయంలో శ్రీవారి దర్శనమై తిరుగు ప్రయాణమైన వారూ తిరుపతిలో ఆగి విశ్రాంతి తీసుకుని వెళ్లాలని సూచించారు. తద్వారా నిద్రమత్తు వీడి.. కొంతవరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొంటున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

అనుమానాస్పద స్థితిలో లిక్కర్ గోడౌన్ సెక్యూరిటీ గార్డు మృతి

రేణిగుంట, జూన్ 29, (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో లిక్కర్ గోడౌన్ సెక్యూరిటీ గార్డు కృష్ణారెడ్డి (65) మృతి చెందారు. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. తిరుపతి- రేణిగుంట మార్గంలోని మద్యం గోడౌన్ వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వీరి సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. మృతుడు తిరుపతి నగరం లీలామహల్ వద్ద ఉంటున్న కృష్ణారెడ్డి (65)గా గుర్తించారు. తల వెనుక భాగంలో, ఒంటిపై గాయాలున్నాయి. షర్టు అక్కడక్కడ చినిగిపోయింది. క్లూస్ టీము ద్వారా వివరాలు సేకరిస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించనున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయాస్పత్రికి తరలించి.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కాలువ తవ్వకంపై అభ్యంతరం


కాలువ తవ్వకాన్ని అడ్డుకున్న పిట్టివానిపల్లి గ్రామస్తులు

చిట్టమూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రొయ్యల చెరువులోని కలుషిత నీటిని గ్రామం వైపు మళ్లించేందుకు తవ్విన కాలువను ఆదివారం పిట్టివానిపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. మల్లాం గ్రామానికి చెందిన ఓ రొయ్యల చెరువు యజమాని సుమారు 50 ఎకరాల్లో రొయ్యల పెంపకం చేపట్టారు. ఆ చెరువుల్లోని కలుషిత నీటిని గ్రామం వైపు మళ్లించేందుకు ఆదివారం కాలువ తవ్విస్తుండడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. రొయ్యల హార్వేస్టు సమయంలో వచ్చే కెమికల్స్‌తో కూడిన కలుషిత నీరు పక్కనే ఉన్న రొయ్యల కాలువలోకి వెళ్లేదని, ఆ కలుషిత నీటిని గ్రామం వైపు వదిలి పెట్టేందుకు కాలువ తవ్వించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక గ్రామానికి దగ్గర్లో ఉన్న పంట కాలువను కూడా పూడ్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి వల్ల వ్యాధులు ప్రబలడమే కాకుండా పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీలు
నేడు పోలీసు కార్యాలయంలో ప్రక్రియ

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీల ప్రక్రియ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరగనున్నది. జిల్లా వ్యాప్తంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు 700 మంది వరకు ఉన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసినవారు, ప్రత్యేక కేటగిరి, రిక్వెస్టు బదిలీలు కోరుకునేవారితో కలిపి మొత్తం సుమారు 500 మందికి స్థాన చలనం కలగనున్నది. పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 8 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు పీహెచ్ సర్టిఫికెట్, వీహెచ్ సర్టిఫికెట్, స్పౌజ్, నో డ్యూస్, మెడికల్ సర్టిఫికెట్లను ఒక సెట్ జిరాక్స్‌తో పాటు ఒరిజనల్స్‌ను తీసుకురావాలని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ఉపాధి పనుల్లో అవినీతిపై విచారణ చేపట్టాలి

కోట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టాలని వైసీపీ నాయకుడు పాదర్తి రాధాకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్‌లో ఆదివారం ఆయనతో పాటు కోట మండల వైసీపీ అధ్యక్షుడు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం మంజూరు చేసిన రూ.1150 కోట్లు పంచాయతీలకు కేటాయించాలన్నారు. అలాగే పంచాయతీరాజ్ చట్టం 11 జీవో నెంబరును వెంటనే రద్దు చేసి కార్యదర్శులను విధుల్లోకి తీసుకొని పనిభారం తగ్గించి వేతనాలు పెంచాలన్నారు. ఈ డిమాండ్లపై సోమవారం తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు వారు చెప్పారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రెండో పట్టణ సీఐ శ్రీనివాస్

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘూతం కల్పించే వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతామన్నారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడకుండా శాంతియుత జీవనం సాగించేలా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కూలీ సదస్సును విజయవంతం చేయండి

గూడూరుఅర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం నిర్వహించనున్న అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రైతుకూలీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనింగ్ మాఫీయా ఆక్రమణలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో రమేష్, మమత తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం


ఎన్‌సీసీ క్యాడెటలతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గోడంగవే

కోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పది రోజులపాటు జరిగిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గోడంగవే, ఎన్‌సీసీ క్యాడెట్లు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. శిక్షణ కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన వారికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

సంకల్పంతోనే డ్రగ్స్ రహిత సమాజం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ సంకల్పం పెట్టుకుంటేనే డ్రగ్స్ లేని సమాజం సాధ్యమవుతుందని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. ఆదివారం 92.7బిగ్ ఎఫ్‌ఎం, జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మత్తు వదలరా త్రీకే రన్ కార్యక్రమం నిర్వహించారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి తిమ్మినాయుడుపాళెం వరకు మూడు కిలోమీటర్లు నిర్వహించిన రన్‌లో పోలీసులు, బిగ్ ఎఫ్‌ఎం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నివారణ కోసం ప్రత్యేకంగా ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమకు సంబంధం లేదని అనుకోకుండా ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌పై సమాచారం తెలిస్తే 1972 నంబరుకు చెప్పాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అనంతరం బిగ్ ఎఫ్‌ఎం ప్రతినిధులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, రిజర్వు సీఐ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


త్రీకే రన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రైల్లో నుంచి జారిపడి యువకుడి మృతి



దొరవారిసత్రం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం చెన్నై వెళ్లే కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి జారి పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. మృతుడికి 30-35 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, బ్లూ షర్టు, సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఇంతకు మించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్ఐ చెన్నైకేశవ తెలిపారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జీఆర్‌పీ పోలీసులకు తెలపాలని కోరారు.

నేత్రదానం


రాధమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 470కి చేరింది. ఆదివారం కచ్చేరివీధికి చెందిన మద్దూరు రాధమ్మ(72) మరణాంతరం ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను దానం చేశారు. చెన్నై శంకర నేత్రాలయకు కార్నియాలను దానం చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



గుర్రపుడెక్కతో నిండిపోయిన దూడలకాలువ - చెట్లతో కమ్ముకుపోయి రూపుకోల్పోయిన నాయుడుకాలువ

వరదొస్తే... ముంపు తప్పదా!
గుర్రపుడెక్క, కలుపు మొక్కలు, చెట్లతో చిట్టడవుల్లా కాలువలు ● దుస్థితికి చేరుకుని రూపుకోల్పోయిన వైనం

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వరదనీరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా కండలేరు క్రీక్‌లో కలిపే కాలువలు దుస్థితికి చేరుకుని రూపుకోల్పోయాయి. ప్రధాన కాలువలు గుర్రపుడెక్క, కలుపు మొక్కలు, చెట్లతో నిండిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. అధ్వానంగా ఉన్న కాలువల్లో వర్షపునీటి పారుదలకు ఇవి అడ్డంకిగా మారి ఎక్కడ పట్టణాన్ని వరదనీటితో ముంచెత్తుతాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో, తుపానుల కారణంగా వరదనీరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా ఉండేలా చల్లకాలువ, దూడలకాలువ, పంబలేరుకాలువ, నాయుడు కాలువలు కాపాడుతున్నాయి. వర్షాలు అధికంగా కురిసిన సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి, పలు చెరువుల నుంచి వచ్చే నీరు చల్లకాలువ, దూడల కాలువ, పంబలేరుకాలువ నుంచి పురిటిపాళెం సమీపంలోని జాతీయ రహదారి వద్ద ప్రవహిస్తున్న పంబలేరువాగులో కలిసి కండలేరు క్రీక్ ద్వారా సముద్రంలో కలిసిపోతాయి. రాపూరు, పైప్రాంతంలో నుంచి వర్షపునీరు మండలంలోని విందూరు గ్రామంలో గల పంబలేరు కాలువ ద్వారా పంబలేరు వాగులోకి, వెంకటగిరి, చెన్నూరు, పైప్రాంతాల ద్వారా వరదనీరు మర్రిపల్లిమడుగు నుంచి చల్లకాలువ ద్వారా, గూడూరుచెరువు నిండిపోతే కలుజులనుంచి దూడల కాలువ ద్వారా వరదనీరు పట్టణాన్ని ముంచెత్తకుండా పంబలేరువాగులో కలిసిపోతాయి. రావిచెరువు నుంచి వచ్చే వర్షపునీరు నాయుడుకాలువ ద్వారా గూడూరు చెరువుకు చేరుకుంటుంది. అయితే ఈ కాలువలు గుర్రపుడెక్క, చెట్లతో నిండిపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకునేలా మారాయి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల్లోని గుర్రపుడెక్క, చెట్లను తొలగించాల్సి ఉంది. భారీ వర్షాలు వస్తే చల్లకాలువ, పంబలేరుకాలువ నుంచి వచ్చే వరదనీరు పట్టణాన్ని ముంచేస్తుంది. దీంతో జనార్దనరెడ్డి కాలనీ, దూర్జటి నగర్ తదితర లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి అవుతుంటాయి. గూడూరు చెరువు నిండిన సమయంలో దూడల కాలువలో ప్రవాహపు నీరు ముందుకు వెళ్లకపోవడంతో ఆర్టీసీ బస్టాండు, విఘ్నేశ్వరపురం, వరదానగర్ గిరిజనకాలనీ తదితర ప్రాంతాలు వరదనీటిలో చిక్కికుపోతాయి. ఏటా ఇదే తంతు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. ప్రస్తుతం చల్లకాలువ, దూడలకాలువ గుర్రపుడెక్క, కలుపు మొక్కలతో నిండిపోగా, నాయుడు కాలువ నిండా చెట్లు పెరిగిపోయాయి. సంబంధింత అధికారులు చర్యలు తీసుకుని కాలువల్లో పూడిక తీసి, గుర్రపుడెక్క, చెట్లను తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

డీమ్డ్ యూనివర్శిటీగా ఆదిశంకర విద్యాసంస్థలు


మీడియాతో మాట్లాడుతున్న వంకి పెంచలయ్య

గూడూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను అందించే ఆదశంకర విద్యాసంస్థలకు డీమ్డ్ యూనివర్శిటీ హోదా లభించిందని చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య తెలిపారు. ఆదివారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ 2001లో 180 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఆదశంకర కళాశాలలో ఇంజనీరింగ్‌తో పాటు డిప్లొమా, ఫార్మసీ, లా, బీఈడీ కోర్సుల్లో నేడు 8వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 975 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు తమ డీమ్డ్ యూనివర్శిటీలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నామని చెప్పారు. తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించడంతో పాటు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. తమ విద్యాసంస్థలు డీమ్డ్ యూనివర్శిటీగా మారేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజయ్య, రామయ్య, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో కార్డన్‌సెర్చ్


టిడ్కో గృహాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ నేరాలను అదుపుచేసేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఈ ప్రాంతంలో ఎవరైనా కొత్తవ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామని, ప్రజలందరూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్‌బాబు, గోపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాన్యూస్ కార్యాలయంపై దాడి హేయం

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మహాన్యూస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మీడియా ప్రతినిధులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మహాన్యూస్ కార్యాలయంపై దాడులకు పాల్పడిన బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కఠిన చర్యలు చేపట్టాలని, ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పోలీసు స్టేషన్‌కు రెండు మోటరు సైకిళ్లు


పోలీసుస్టేషన్‌కు చేరిన మోటరు సైకిళ్లు

సూళ్లూరుపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట పోలీసు స్టేషన్లకు రెండేసి మోటరు సైకిళ్లను ప్రభుత్వం కేటాయించింది. అధునాతన సౌకర్యాలున్న ఈ మోటరు సైకిళ్లకు ఒకవైపు ఎరుపు రంగు బల్బుతో సిగ్నల్, మరోవైపు బ్లూ రంగు సిగ్నల్స్ లైట్స్‌తో పాటు సైరన్ అమర్చారు. ట్రాఫిక్‌తో పాటు రాత్రి సమయాల్లో ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బంది ఈ మోటరు సైకిళ్లపై ఘటనా స్థలానికి చేరుకుంటారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది.

గ్యాస్ సిలిండర్ పైపు లీక్
తప్పిన ప్రమాదం

నాయుడుపేట టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పొగగొట్టంకాలనీ సమీపంలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పైపు లీక్ అవడంతో మంటలు చెలరేగాయి. ఆదివారం గృహిణి ఇంట్లో వంట చేస్తుండగా ఆకస్మాత్తుగా గ్యాస్ సిలిండర్ పైపు లీక్ కావడంతో మంటలు చెలరేగడంతో ఇంట్లో కుటుంబసభ్యులు పరుగులుతీశారు. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చే అంతలోపు స్థానికులే మంటలను అదుపుచేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

కోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, వెంకన్నపాళెం, కోట, తిమ్మానాయుడుపాళెం, కొక్కుపాడు పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దారు జయజయరావు తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించి బీఎల్‌వోలకు సూచనలిచ్చారు. ఆయన వెంట మండల సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు శ్రీనివాసులు, రమణయ్య ఉన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దారు

రేపటి నుంచి అకడమిక్ కన్సల్టెంట్లకు పర్ఫార్మెన్స్ రివ్యూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో అకడమిక్ కన్సల్టెంట్లు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మంగళవారం నుంచి పర్ఫార్మెన్స్ రివ్యూ నిర్వహించనున్నారు. జూలై 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ చేపట్టేందుకు యూనివర్సిటీ అధికార యంత్రాంగం ప్రణాళికను రూపొందించింది. అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లోని వీసీ ఛాంబర్‌లో ఏర్పాట్లు చేశారు. 1వ తేదీ ఆంత్రోపాలజీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్‌సైన్స్, జియాలజీ, హోమ్‌సైన్స్ మ్యాథ్స్, ఫిజిక్స్ స్టాటిస్టిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన వారికి రివ్యూ చేపడతారు. 2న ఫిషరీసైన్స్, జువాలజీ, కామర్స్ కంప్యూటర్‌సైన్స్, ఫార్మసీ సబ్జెక్టులకు నిర్వహిస్తారు. 3న సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్, 4న అడల్ట్ ఎడ్యుకేషన్, ఆర్కియాలజీ, హిస్టరీ, టూరిజం, ఉర్దూ, ఉమెన్ స్టడీస్, పాపులేషన్ స్టడీస్, ఎకనమెట్రిక్స్, ఎకనమిక్స్, ఇంగ్లిషు, హిందీ, హ్యూమన్‌రైట్స్ సోషియాలజీ వారికి రివ్యూ చేపడతారు. 5న లా, లైబ్రరీసైన్స్, ఫిలాసఫీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, పొలిటికల్‌సైన్స్, లింగ్విస్టిక్స్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్, సంస్కృతం, హిందీ, తమిళం, ఎడ్యుకేషన్, ఏఐఎస్ఈ వారికి రివ్యూ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి యూనివర్సిటీలోని కాలేజీలకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

త్వరలో జూనియర్స్ సీపీఎల్

తిరుపతి(క్రీడలు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): జూనియర్స్ సీపీఎల్ 1 త్వరలో నిర్వహించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్స్ సీపీఎల్ 1 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే క్రీడా ప్రతిభను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో 12నుంచి 16సంవత్సరాల లోపు క్రీడాకారులతో జూనియర్స్ సీపీఎల్ 1 టీ 20లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టీంలను ఫ్రాంచైజీ ద్వారా దక్కించుకునేందుకు ఆసక్తిగల యజమానులు ముందుకురావాలని, మరిన్ని వివరాలకు 8886185559, 9000214966నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహాచారి, నరేంద్ర, రవి, గిరిప్రకాష్, శ్రీనివాసమూర్తి, శ్రీధర్, సతీష్‌యాదవ్, హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్యశ్రీనివాస్, వేణుగోపాల్‌నాయుడు, శివప్రసాద్, రమణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సిద్ధంకండి

తిరుపతి(ఆటోనగర్), జూన్29(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.కవిత కోరారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్న పాలకులకు బుద్ధి వచ్చేలా నిర్వహిస్తున్న ఈ సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొనాలని కోరారు. ఈ శిక్షణా తరగతుల్లో నాయకులు ఆర్.లక్ష్మి, ఎస్.జయచంద్ర, మాధవ్, కేఎస్ఎస్ ప్రసాదరావు మాట్లాడారు. నాయకులు లక్ష్మి, ఉష, జానకి, అను పాల్గొన్నారు.

ఇంటింటికీ మంచి ప్రభుత్వంపై దిశా నిర్దేశం


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూయిన సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమంపై ప్రజలకు వివరించేలా ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చెప్పారు. ఆదివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడిన ఆమె మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారన్నారు. వచ్చే నెల 2నుంచి ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపడుతామన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు


చెత్తాచెదారాలను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని బీసీ కాలనీలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నట్లు టీడీపీ నాయకులు ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్‌రహీం అన్నారు. ఆదివారం 33వ వార్డులో చెత్తా చెదారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వార్డులో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో పాటు కాలువల్లో మురుగు నిల్వ చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పరమేశ్వర్, ఇశ్రాయిల్ కుమార్, స్థానికులు పాల్గొన్నారు.